క్లుప్తంగా

కల్యాణ మండపం ప్రారంభం


కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆవులతిప్పాయిపల్లెలో ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద నూతనంగా నిర్మించిన కల్యాణమండపాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు యువ నేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. దాదాపు రూ.80 లక్షలతో కళ్యాణ మండపాన్ని నిర్మించినట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆశ్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు భక్తుల సౌకర్యార్థం చేపట్టిన నిర్మాణాలపై కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డికి వివరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు శ్రీరామిరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, నాగేశ్వరెడ్డి, రామచంద్రారెడ్డి , వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆలూరి రామచంద్రారెడ్డి, జనార్ధన్ రెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీఓ యోగానందరెడ్డి తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో వలంటీర్ల పనితీరు, ఉద్యోగుల హాజరుపై ఆరా తీశారు. సచివాలయం వద్దకు వచ్చిన ప్రజలకు ప్రభుత్వ సేవలను త్వరిగతిన అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఓబుళేసు ఉన్నారు.

ఘనంగా 'ఊరి విందు'


భోజనాలు చేస్తున్న పట్టణవాసులు

గుత్తి: వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో దసరా ముగింపు ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఊరు విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. పట్టణానికి చెందిన వందలాది మంది సామూహిక భోజనాలు చేశారు. అంతకు ముందు వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బుధవారం ఆయన చింతకాయమంద గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎలాంటి సమస్యలున్నా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలన్నారు.

నామినేషన్ల స్వీకరణ


నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

గుత్తి: గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బాంక్ ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియ బుధవారం జరిగింది. గుత్తి ఆర్ఎస్‌లోని టౌన్ బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయంలో ఎన్నికల అధికారి బండి సత్యనారాయణ రెడ్డి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 12 డైరెక్టర్ల పదవులకు 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం నామినేషన్ల పరిశీలన, శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ, నవంబర్ 5న పోలింగ్ ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ మహేశ్వరప్రసాద్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై చింతల రాయుడు


గరుడ వాహనంపై విహరిస్తున్న చింతలరాయుడు

తాడిపత్రి అర్బన్: చింతల వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవం సాగుతున్నాయి. నాల్గవ రోజు బుధవారం అశేష భక్త జనసందోహం జయజయ ధ్వానాల మధ్య గరుడ వాహనంపై చింతల రాయుడు పురవీధుల్లో విహరించారు. ఉదయం స్వామి మోహినీ అలంకారంలో కొలువుదీరి భక్తులతో పూజలందుకున్నాడు. గరుడ వాహనంపై ఉన్న స్వామి వారిని దర్శించడం వలన సర్పదోష శాంతి, దివ్యమైన జ్ఞానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. స్వామి ఊరేగింపు పట్టణంలోని మెయిన్‌బజార్ మీదుగా సాగి తిరిగి పట్టణ పోలీస్‌స్టేషన్ సర్కిల్‌కు చేరుకుంది. భక్తులు వీధుల్లో కళ్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేసి స్వామికి ఘన స్వాగతం పలికారు.

దేశానికే ఆదర్శం సచివాలయ వ్యవస్థ

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మలు అన్నారు. బుధవారం కల్లుమడి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డా.వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే అందుతున్నాయన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వలంటీర్ల ద్వారా అప్పటికప్పుడే సమస్యలు పరిష్కరిస్తున్నారని గుర్తు చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో అర్హతలున్నా సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవికావన్నారు. కేవలం జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికి, టీడీపీ నాయకులు, కార్యకర్తలకే దక్కాయన్నారు. కాని జగనన్న పాలనలో అర్హత ఉన్న ప్రతి పేదవారికీ కుల,మత, పార్టీ భేదం లేకుండా సంక్షేమ పథకాలందిస్తున్నామని తెలిపారు. అందుకే నేడు జగనన్న పేదల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. పేదల పక్షపాతిగా మారిన జగనన్నను మరోమారు సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీడీఓ నిర్మలాకుమారి, సర్పంచ్ పక్కీరమ్మ , ఎంపీటీసీ నల్లప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బోయ కొండయ్య, శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.



కల్లుమడిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న, ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి


ఎంపీ రంగయ్యను సన్మానిస్తున్న దివ్యాంగుల కమిటీ సభ్యులు

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పీ కొండాపురం గ్రామ సమీపాన ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి చొరవతో కేటాయించిన స్థలంలో బుధవారం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం ఇవ్వనంతగా దివ్యాంగుల పింఛన్ ఇస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రూ.లక్షలు ప్రభుత్వమే భరిస్తూ పిల్లలకు ప్రాణం పోస్తున్న దేవుడు వైఎస్ జగన్ అన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు దత్తు, రాజు, సింగరప్ప, రమణ, రవి, ముకుందరావు, పెద్దకాలువ వినోద్, వెంకటేశ్వరరావు, శివ, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, దివ్యాంగుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర ఏర్పాట్ల పరిశీలన


శింగనమలలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పరిశీలించారు. బుధవారం శింగనమలలో బస్సుయాత్రపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, బీఆర్ అంబేద్కర్ విగ్రహాల పెయింటింగ్ పనులు, వైఎస్సార్ సర్కిల్ వద్ద బస్సు బయలుదేరు ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడే ప్రెస్ గ్యాలరీ, నాడు-నేడు పనుల ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. బస్సు ముందు నిర్వహించనున్న బైక్ ర్యాలీపై నాయకులతో చర్చించారు. బుక్కరాయసముద్రంలో జరిగే బహిరంగ సభకు భారీగా తరలిరావాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో గాండ్ల రాష్ట్ర డైరెక్టర్ నరసయ్య, సర్పంచ్ వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగవర్ధన్, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, ఎల్ రాజు, భాస్కర్, వెంకటనారాయణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి శోభాయాత్ర


దుర్గామాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా భారతీయ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని 9 ప్రాంతాల్లో కొలువుదీర్చిన దుర్గామాత విగ్రహాల శోభాయాత్ర బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. స్థానిక రైల్వేగ్రౌండ్ నుంచి మొదలైన శోభాయాత్ర మెయిన్‌రోడ్డు, బీరప్పసర్కిల్ మీదుగా వినాయక ఘాట్ వరకు కొనసాగింది. అనంతరం దుర్గాదేవి విగ్రహాలను వినాయకఘాట్‌లో నిమజ్జనం చేశారు. ఈ ర్యాలీలో మహిళల సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సమితి అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు, ఉపాధ్యక్షులు వసుంధర, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, ఆ నలుగురు సేవాసమితి సభ్యులు రవీంద్ర, శ్రీధర్‌రెడ్డి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే జగనన్న లక్ష్యం


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

శింగనమల: రాష్ట్రంలోని ప్రజలందరికీ మెరుగైన వైద్యమందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. బుధవారం కల్లుమడి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారు పరిశీలించారు. అక్కడకి వచ్చిన ప్రజలతో వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. అంగన్‌వాడీ పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని ఇగుడూరు గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు లావణ్య, సుమన్ 351 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగరావు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: దంచర్ల గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. ఎంపీడీఓ వెంకటరమణప్ప, ఎంపీపీ బీవీ మాధవి, సర్పంచ్ నారాయణస్వామి, ఎంపీటీసీ పరశురాముడు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా, కమిషనర్ జి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల మహోత్సవం


పెద్దపప్పూరులో జ్యోతులను ఊరేగిస్తున్న దృశ్యం


యాడికిలో జ్యోతులతో చిందులేస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: దసరా పండుగ సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున చౌడేశ్వరీదేవి అమ్మవారి జ్యోతుల ఉత్సవం వైభవంగా జరిగింది. చింతంబరస్వామి గుడి నుంచి ప్రారంభమైన ఊరేగింపు పాతసంతమార్కెట్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు కొనసాగింది. నేత కార్మికులు అమ్మవారి జ్యోతులను గ్రామపురవీధుల్లో తప్పెట్ల, మేళాలతో నడుమ భక్తిగీతాలను ఆలపిస్తూ ఊరేగించారు. వేడుకను తిలకించడానికి పరిసర గ్రామాలైన షేక్‌పల్లి, ధర్మాపురం, చాగల్లు, గార్లదిన్నె, చిన్నపప్పూరు, చింతరపల్లి, నరసాపురం తదితరగ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఏటా దసరా సందర్భంగా అమ్మవారి జ్యోతుల ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శరత్‌చంద్ర బందోబస్తు ఏర్పాటు చేశారు.

బుక్కరాయసముద్రం: నీలాంపల్లి సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సర్పంచ్ రసూల్‌బీ అధ్యక్షతన నిర్వహించారు. వైద్యులు 508 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అందించారు. జెడ్పీటీసీ భాస్కర్, ప్రత్యేక అధికారి శ్రీదేవి, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంపీటీసీ అంజిన్‌రెడ్డి పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలో బుధవారం జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున తొగటవీర క్షత్రియులు మార్కండేయ స్వామి ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన జ్యోతులను నెత్తిన పెట్టుకుని యాడికి పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గార్లదిన్నె: ఇల్లూరు, కమలాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద నిర్మించిన సీసీరోడ్లను ఎంపీడీఓ విజయభాస్కర్ బుధవారం పరిశీలించారు. మండలవ్యాప్తంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద అభివృద్ధి పనులు చేపట్టామని ఎంపీడీఓ తెలిపారు. ఈనెల 28న కమలాపురంలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్‌ను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభిస్తారన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

పామిడి: స్థానిక చిన్న విఠోబ కాలయంలో బుధవారం రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. రుక్మిణీ పాండురంగస్వామిని శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భావసార క్షత్రియ భజన బృందం ప్రత్యేక కీర్తనాలాపనల నడుమ ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం చేశారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనం

తాడిపత్రి అర్బన్: దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని చౌడేశ్వరీ ఆలయంలో ప్రతిష్టించిన అమ్మవారి విగ్రహ నిమజ్జనాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి యల్లనూరు రోడ్డు నుంచి వాల్మీకి సర్కిల్ మీదుగా పోలీస్‌స్టేషన్ సర్కిల్, నవరంగ్ టాకీస్ రోడ్డు, మెయిన్‌బజార్, హనుమాన్ జంక్షన్ మీదుగా ఊరేగించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి అర్బన్: చుక్కలూరు రోడ్డులో పెన్నానది బ్రిడ్జి కింద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సెబ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు సాయికుమార్, షాషావలి, గుర్రప్పను అరెస్ట్ చేసి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వేరుశనగలో పంట కోత ప్రయోగాలు


పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

గార్లదిన్నె: బూదేడులో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు వేరుశనగ పంటలో పంటకోత ప్రయోగాలు చేశారు. ఈసందర్భంగా ఏఓ సోమశేఖర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య పొలంలో ఎకరానికి 170 కేజీలు దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రాజ్యలక్ష్మి, ఎంపీఈఓ లలిత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్ : ధర్మాపురం గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిపత్రి మండలం కొట్టాలపల్లికి చెందిన రజాక్ వలి బెల్దారి పనులు చేసేవాడు. ఊబిచెర్లలో ఇంటికి బండలు పరిచేందుకు బొలెరో వాహనంలో బండల లోడుతో బయలుదేరారు. ధర్మాపురం గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బొలెరో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రజాక్ వలిపై బండలు పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని గుత్తి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఈ-క్రాప్ జాబితాల ప్రదర్శన

యాడికి: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన పంటల ఈ-క్రాప్ జాబితాలను గురువారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 26,725 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశామన్నారు. ఈ మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో ఈ నెల 26 నుంచి 29 వరకు ప్రదర్శిస్తామన్నారు. ఏమైనా తప్పిదాలు ఉంటే 29వ తేదీలోపు సరిదిద్దుకోవాలని సూచించారు.

నీటి పొదుపుపై అవగాహన కల్పించండి


వాటర్ వర్క్స్ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: తాగునీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వాటర్‌వర్క్స్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఉదయం ఆయన పాతమున్సిపల్ కార్యాలయ ఆవరణలో నాన్ పీహెచ్ వర్కర్స్‌కు మస్టర్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. ఎన్నిరోజులకోసారి నీరు వదులుతున్నారని ఆరా తీశారు. నీరు వృథా కాకుండా ఫిట్టర్లు, టర్న్‌కాక్‌లు ఆయా వార్డుల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలు, కలుషిత నీరు సరఫరాతో పాటు నీటి సమస్యల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మిల్లు ఏరియాలో పర్యటించి ఇంటింటా చెత్తసేకరణ, పారిశుధ్య పనులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డు ఇన్‌చార్జ్ శేఖర్, డీఈ రామ్మూర్తి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లుటౌన్: మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్ ప్రాతినిధ్యం వహిస్తున్న 23వ వార్డులో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

అనగానదొడ్డిలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: అనగానదొడ్డి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాము గత కొన్ని నెలలుగా కుటుంబసమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపం చెందిన అతడు ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న రామును కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లి శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి బైక్‌పై నుంచి పడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన నాగప్రకాష్, టోనీ బ్లెయిర్ పని నిమిత్తం బైక్‌పై బళ్లారికి వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి ప్యాపిలికి వెళ్తుండగా కొజ్జేపల్లి శివారులో బైక్ అదుపు తప్పి బోల్తా కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శ పాఠశాల హెచ్‌ఎంగా ఓబుళరెడ్డి


ఓబుళరెడ్డి

పుట్లూరు: స్థానిక ఆదర్శ పాఠశాల హెచ్‌ఎంగా ఓబుళరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న లావణ్యకుమారి తాడిపత్రికి బదిలీ కావడంతో ఇన్‌చార్జ్‌గా ఆస్మా సయోద బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రెగ్యులర్ హెచ్‌ఎంగా ఓబుళరెడ్డి నియామకంగా కావడంతో ఆయనకు బాధ్యతలను అప్పగించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన అనిత బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. వివరాల్లోకి వెళితే.. గత కొన్ని రోజులుగా అనిత కుటుంబ సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై జొన్నగిరి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వేలం వాయిదా

తాడిపత్రి అర్బన్: కూరగాయల మార్కెట్ సమీపంలోని చేపల మార్కెట్ సంబంధించిన వేలం పాటను వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ జి.రవి బుధవారం తెలిపారు. వేలం పాట తేదీని త్వరలోనే నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బుక్కరాయసముద్రంలో తలపెట్టిన సామాజిక సాధికార యాత్ర బహిరంగసభ విజయవంతం చేయాలని బుధవారం జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతోందన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెదసంఖ్యలో తరలిరావాలని కోరారు.